# యాదగిరీశుడికి నిత్యారాధనలు



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో లక్ష్మీనరసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సుమారు గంటన్నరకు పైగా కల్యాణతతును జరిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు కల్యాణతంతును వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. కార్తీక మాసం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులు వ్రత పూజలు ఆచరించారు. తెల్లవారుజామున మహిళలు దీపారాధనలో అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిపారు. మణవాళ మహామునుల తిరు నక్షత్రోత్సవం వైభవంగా జరిగింది. మూడో రోజులో భాగంగా ఉదయం స్వామివారికి తిరువాయిమూడి అనుసంధనాం చేపట్టారు. సాయంత్రం మణవాళ మహామునుల పురప్పాట్ సేవ చేపట్టి తిరునక్షత్రోత్సవాలకు ముగింపు పలికారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.17,99,675 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

# సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

- బీఆర్ఎస్ నకిరేకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నారెగూడెంలో పలు కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక



రామన్నపేట : గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, నవంబర్ 16 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందనుందని బీఆర్ఎస్ నకిరేకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని నారెగూడేనికి చెందిన 50 కాంగ్రెస్ కుటుంబాలు గురువారం కట్టంగూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. అమలు కాని హామీలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతుందని, ప్రజలు వారిని నమ్మొద్దని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ ఏరు యల్లయ్య, కట్ట నగేశ్, దుప్పెల్లి యాదయ్య, కమాల్, సయ్యద్, బడేసాబ్, షరీఫ్, హుస్సేన్, అఫ్జల్, జ్యోతి, లక్ష్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, సర్పంచ్ కురిమిల్ల పూలమ్మ, ఉప సర్పంచ్ ఎర్రమాద నర్సిరెడ్డి, కుమిల్ల మల్లేశ్ పాల్గొన్నారు.

## బోగారం నుంచి 30 మంది చేరిక..

రామన్నపేట : మండలంలోని బోగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 30 మంది సర్పంచ్ అంతటి పద్మారమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమారమేశ్, ఉప సర్పంచ్ జెల్ల శ్రీనివాస్, సత్తయ్య, శ్రీనివాస్, మల్లేశం, నరేశ్ పాల్గొన్నారు.

# రైతులను బిచ్చగాళ్లతో పోల్చిన కాంగ్రెస్‌ను ఓడించాలి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక



యాదగిరిగుట్టలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్16 : రైతులను బిచ్చగాళ్లతో పోల్చిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో బొమ్మలరామారం మండలం రంగాపురం, మర్యాల, యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లికి చెందిన గంగపుత్ర సంఘం నుంచి, ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిపి మొత్తం 600 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చీకటి రోజులు రావడం ఖాయమన్నారు. ఒక్కప్పుడు మంచినీళ్ల కోసం మహిళలు బిందెలు పట్టుకుని రోడ్లపైకి వచ్చిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ పథకం కింద స్వచ్ఛమైన మంచినీళ్లు అందజేసి వారికి అండగా నిలిచారన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల అమలుతోపాటు తాజాగా విడుదల చేసిన మ్యానిఫెస్టోతో బీఆర్ఎస్ బలం రోజురోజుకూ పెరుగుతుందన్నారు. వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వివిధ మండలాల అధ్యక్షులు వెంకటయ్య, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సర్పంచులు, గ్రామశాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.



దేవోజీనాయక్‌తండా యువతకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ ఆలేరు అభ్యర్థి, ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

# బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

- ఆ పార్టీ ఆలేరు అభ్యర్థి, ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- దేవోజీనాయక్‌తండా, గొల్లగూడెంవాసులు బీఆర్ఎస్‌లో చేరిక

తుర్కపల్లి, నవంబర్16 : ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దేవోజీనాయక్‌తండాలో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తండాకు చెందిన ధీరావత్ బూర్యా, రాంజీ, రవి, సంతోశ్, గోవింద్‌తోపాటు గొల్లగూడెం గ్రామానికి చెందిన బబ్బూరి ఓంకార్‌గౌడ్, దేశపాండ్య మహేశ్‌తోపాటు 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్‌తో సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు.



తిప్పర్తి : బీఆర్ఎస్‌లో చేరిన వారితో కలిసి నినదిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్

# ఎమ్మెల్యే కంచర్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

తిప్పర్తి , నవంబర్ 16 : ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో మర్రిగూడ గ్రామానికి చెందిన 30మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే మండలంలోని గోదోరిగూడెం నుంచి 10 మంది, సిలార్‌మియాగూడెం నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే కంచర్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి మద్దతుగానే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు జీడిపల్లి వెంకట్‌రెడ్డి, యర్రమాద నరేందర్‌రెడ్డి, సర్పంచ్ యర్రమాద కవిత, లొడంగి గోవర్ధన్, కందుల లక్ష్మయ్య, కట్టా సూర్యప్రకాశ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సిరిగిరి పద్మావెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

